



చదివి..ఎదిగారు.. వీసీగా వచ్చారు!

నన్నయ వీసీగా సత్తుపాటి ప్రసన్నశ్రీ

విద్యార్థులకు ఆమె ఆదర్శం.. ఎలా చదవాలి.. ఎలా ఎదగాలి అనే దానికి ఆమె ఒక నిదర్శనం.. ఎందుకంటే ఎక్కడో గుంటూరు జిల్లా స్టూవర్టుపురం ఆమె స్వగ్రామం.. ఆ పేరు వింటే అందరికీ గుర్తొచ్చేది ఒక్కటే.. కానీ అక్కడ నుంచి ఎదిగారు.. కష్టపడి చదివారు.. ఒక్కటి కాదు.. రెండు ఏకంగా 23 భాషలు మాట్లాడతారు.. 17 గిరిజన భాషలకు లిపిని తయారుచేసి తానేంటో నిరూపించారు.. కూటమి ప్రభుత్వం పట్టం కట్టడంతో తూర్పుగోదావరి జిల్లాలోని నన్నయ వర్సిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు.. ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా నేను రాజమహేంద్రవరం కోడలినే అంటూ పలు విషయాలు చెప్పకొచ్చారు.. 6

సిల్వర్..మెరుపులు!



బంగారమే కాదండోయ్.. సిల్వర్ ధగధగ లాడుతోంది.. తగ్గుతూ పెరుగుతూ రూ.లక్షకు చేరింది.. గత వారం రోజులుగా రూ.99,500లకు చేరువై రూ.లక్ష దోబూచులాడుతోంది.. బుధవారం రూ.99,800లు పలికింది.. గురువారం రూ.లక్షకు చేరువైంది. 6

మన ప్రకృతి సాగుపై జర్మన్ బృందం ఆసక్తి



మన ప్రకృతి సాగును పరిశీలించేందుకు జర్మన్ బృందం వచ్చింది.. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో రైతులతో మాట్లాడి ప్రకృతి సాగుపై అవగాహన పెంచుకుంది.. ఎలా సాగు చేయాలో పరిశీలించింది. 7

సైకిల్‌కు సవాల్



కూటమి పక్షాన భారీగా మోహరింపు

- ఎమ్మెల్సీ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ
- మంత్రులు, ఎమ్మెల్యేల మోహరింపు
- ఆశించిన మెజార్టీ కోసం పట్టు
- బరిలో 35 మంది అభ్యర్థులు
- ఓటర్లు 3.15 లక్షలు
- చెల్లని ఓట్ల తగ్గింపుపై వ్యూహం
- పట్టభద్రుల చుట్టూ ప్రచారం

(ఏలూరు/కాకినాడ, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీలో ఉన్న అభ్యర్థులంతా ప్రచారానికి మరింత పదునుపెట్టారు. క్షేత్ర స్థాయిలో గట్టి నాయకత్వ పట్టున్న టీడీపీ ఎట్టిపరిస్థితుల్లోను ఈ స్థానం నుంచి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలిచి తీరాలనే పట్టుదలతో ఉంది. సీఎం చంద్రబాబు నుంచి ముఖ్యనేత లంతా ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీగా సమాచారాన్ని రాబట్టడమే కాకుండా అప్పటి కప్పుడే సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడ వెనుకబడ్డారు? ఎక్కడ దూసుకెళ్తున్నారనే విషయాన్ని రాబడుతూనే వచ్చారు.పట్టభద్రులైన ఓటర్లంతా తరలివచ్చేలా చేయడం అంత సులువు కాదని భావించి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశారు. గత అనుభవాలను దృష్ట్యా సాధారణ ఎన్నికల కంటే మించి ఎమ్మెల్సీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు రావా లన్న షరతు విధించారు.దీంతో ఇప్పుడు కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలు,మంత్రులతో పాటు మిగతా వారందరికీ ఈ ఎన్నిక ఒక సవాల్‌గానే మారింది.పట్టభద్రుల ఓటర్లు అత్యధికంగా ఉన్న మండల కేంద్రాలు,పట్టణాలు, కార్పొరేషన్లలో ప్రచారాన్ని మోహరించారు.

బరిలో 35 మంది..

ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. వీరిలో అత్యధికులు ప్రచారంలోను శరవేగంగా ముందుకు సాగుతూనే ఉన్నారు. యువతకు మేలు జరగాలంటే తాము విధాన పరిషత్‌లో అడుగు పెట్టేలా చూడాలని ఓటర్లను అభ్యర్థిస్తూ వస్తున్నారు. తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం అభ్యర్థిగా ఉన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, వివిధ విభాగాల కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, సభ్యులతోపాటు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రచారంలో ఒక ఊపు తెస్తున్నారు. ఏ నియోజకవర్గంలో ఎంతెంతమంది ఓటర్లు ఉన్నది ఇప్పటికే గుర్తించినందున దీని ఆధారంగా చేసుకుని ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమ గోదావరికి చెందిన ఇన్‌చార్జి మంత్రులు గొట్టిపాటి, నాదెండ్లతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రులు నారాయణ,అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు కూటమి నేతలను ఏకం చేసి ఏ రోజుకారోజు నియోజకవర్గాల్లో ఉన్న స్థితిగతులను ఆరా తీస్తున్నారు. వీరితో పాటు మంత్రులు కందుల దుర్గేష్‌సుభాష్ కూడా ఆయా నియోజకవర్గాల్లో కూటమి శ్రేణులను సమన్వయం చేస్తున్నారు. జనసేన పక్షాన ఎమ్మెల్యేలుగా ఉన్న పోలవరం, ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలుతో పాటు రాజానగరం, పిఠాపురం, రాజోలు, పి.గన్నవరం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఓటర్ల నాడి ఎలా ఉందో జనసేన ఆ పార్టీ ఆరా తీస్తోంది. బీజేపీ మాత్రం ఈ విషయంలో పెద్దగా చొరవ తీసుకున్న పరిస్థితి కనిపించడంలేదు. తెలుగుదేశం, జన సేన నేతలంతా ఉమ్మడిగా నియోజకవర్గాల్లో కలియ తిరుగుతుండగా,కమలనాథులు మాత్రం తమకు ప్రత్యేకించి ఆహ్వానం లేదన్నట్టుగా మిన్నకుండిపోతున్నారు.మండల స్థాయిలోను ఇదే ధోరణిలో అన్ని పార్టీలు ఉన్నాయి. తెలుగు దేశం మాత్రం అభ్యర్థి రాజశేఖరం గెలుపును భుజానకెత్తుకుని విరామం లేకుండా ప్రచారం కొనసాగిస్తోంది.

చెల్లని ఓట్లే అత్యంత కీలకం

గడిచిన పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు నమోదయ్యాయి. అప్పట్లో రెండు లక్షల 20 వేలకుపైగా ఓట్లు ఉండగా లక్షా 92 వేల 24 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 13 వేల 852 ఓట్లు చెల్లకుండా పోవడంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. పీడీఎఫ్ బలపరిచిన యిళ్ల వెంకటేశ్వరరావుకు 98 వేల 193 ఓట్లు లభించగా ఆయన సమీప ప్రత్యర్థి నల్లమిల్లి శేషారెడ్డికి 38 వేల 124 ఓట్లు లభించాయి. ఇప్పుడు జరగబోతున్న ఎన్నికల్లో టీడీపీ పక్షాన రాజశేఖరం ఉండగా పీడీఎఫ్ తరపున దిడ్ల వీరరాఘవులు పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య నువ్వా నేనా అన్నంతగా కూటమి పక్షాన వామపక్షాల తరపున హోరాహోరీగా ప్రచారం సాగుతోంది. వచ్చిన చిక్కల్లా ఏంటంటే ఈ సారి గతంకంటే లక్ష ఓట్లు అదనంగా మూడు లక్షల 15 వేలకుపైగా ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు ఎటు తిరిగి సాధ్యమైనంత మేర చెల్లని ఓట్లు తగ్గించుకోవడం, ఆ మేరకు మెజార్టీ స్థానంలో వచ్చేలా చూడడం కూటమి పక్షాన నేతలందరికీ పెద్ద అగ్ని పరీక్షగానే మారింది. అందుకనే ప్రాధాన్యత ఓటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఓటర్లందరికీ విడమరిచి మరీ చెబుతున్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతోనే బ్యాలెట్ పేపర్‌పై ఒకటవ ప్రాధాన్యత ఓటును ఒకటవ సంఖ్యగా వేయాల్సిందిగా పదేపదే చెబుతూ వస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్ టూ మార్క్ పెట్టవద్దని అభ్యర్థిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగతా ఇండిపెండెంట్ సభ్యులు భారీగానే ఉన్నందున వీరంతా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రచారం ఉధృత స్థాయికి తీసుకువెళ్తున్నారు. గత ఎన్నికల్లో 43 మంది పోటీ పడగా 12 మంది అభ్యర్థులు మాత్రమే వెయ్యి సంఖ్యను దాటి ఓట్లు దక్కించుకోగలిగారు. ఈసారి టీడీపీకి పూర్తి అనుకూలత దక్కేలా కూటమి నేతలు మోహరించడంతో ఆ మేరకు మిగతా ఇండిపెండెంట్‌లకు వచ్చే ఓట్ల సంఖ్యలో చీలిక ఏర్పడే అవకాశం కనపడుతుంది.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు, నాయకులు

గెలుపు రాజశేఖరందే

మంత్రి నిమ్మల రామానాయుడు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని జిల్లా ఇన్‌చార్జి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎంత మంది అభ్యర్థులు ఉన్నా తమదే గెలుపు అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి,రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మ న్ కుడుపూడి సత్తిబాబు, అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

23న గ్రూపు-2 మెయిన్స్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్
- వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్ర జ్యోతి): ఈనెల 23న నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్ రాత పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. ఈ పరీక్షల నిర్వహణపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనురాధతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తుతోపాటు ఇతర ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే మార్గదర్శకాలను జిల్లాలకు పంపామన్నారు. ఈ పరీక్షలకు 92వేల250 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. సోషల్ మీడియాలో ఎక్కడైనా ఎవరైనా వదంతులు, నకిలీ వార్తలు ప్రసారం చేసినా విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ అనురాధ మాట్లాడుతూ ఈనెల 23న ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్-1 రాతపరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9.30 గంటలలోపు ఆయా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలన్నారు. 9.45గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసి వేయాలన్నారు. ఆలస్యంగా వచ్చిన ఎవరినీ లోనికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందని, మధ్యాహ్నం 2.30 గంటలలోగా పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని, 2.45 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేయాలన్నారు. రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మాట్లాడుతూ ఇతర ప్రసార మాధ్యమాల్లో నకిలీ వార్తలు ప్ర సారం చేస్తే వెంటనే స్పందించి పరిశీలించి తగిన చర్యలు తీసుకో వాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల కు 100 మీటర్ల పరిధిలో 144వసెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో పరీక్షల సమయంలో జిరాక్స్, నెట్ కేంద్రాలన్నీ మూసి ఉంచాలన్నారు. పరీక్ష హా ల్లోకి మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వాచీలు తది తర పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోను లోనికి అనుమతించరాదన్నారు. కాన్ఫరెన్స్‌లో జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకట్రావు, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.వెంకటరావు, సెక్షన్ అధికారులు నవ్యజ్యోతి, మాధవిలత, దేవసహాయం, సీపీవో త్రినాద్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పరీక్ష ఏర్పాట్లు చేయాలి: జేసీ

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షనిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లుచేయాలని జేసీ ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్-2పరీక్షలు, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అధికారుల తోసమీక్ష నిర్వహించారు. జిల్లాలో 9,379 అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఈపరీక్షకు 12పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఆంధ్ర సాహిత్య పరిషత్ ప్రభుత్వ మ్యూజియం భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా కేంద్రంలో వివేకానంద పార్కు ఎదురుగా ఉన్న ఆంధ్ర సాహిత్య పరిషత్ ప్రభుత్వ మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారుల ప్రతిపాదన మేరకు నూతన భవన నిర్మాణానికి అనుమతులు లభించాయి. రూ.10కోట్లు ఖర్చు అయ్యే అంచనాలకుగాను కేంద్ర ప్రభుత్వం వాటా ఇప్పటికే రూ.8కోట్లు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.2కోట్లు మంజూరుకు గురువారం పురావస్తుశాఖ మ్యూజియం కమిషనర్ జీవో విడుదలైంది. మ్యూజియం ఏడీ తిమ్మరాజు దీనిపై మాట్లాడుతూ జిప్సస్ శ్రీ భవనం నిర్మించేందుకు అనుమతి లభించిందని, టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి ఏప్రిల్‌లో పనులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

సైక్లింగ్ ట్రాక్‌కి..

ఈ దుస్థితి ఏంటి?



సైక్లింగ్ ట్రాక్‌పై వెళ్తున్న పశువులు

- కాకినాడ స్మార్ట్‌సిటీలో రూ.2కోట్లతో సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం
- పార్కింగ్‌గాను, పశువులకు రహదారిగాను మారిన వైనం
- ప్రజాధనం వృథాపై నగర ప్రజల ఆగ్రహం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్ర జ్యోతి): అదొక సైక్లింగ్ ట్రాక్.. రూ.కోట్లు నిర్మించి కట్టిన ఈ ట్రాక్ నిరుపయోగంగా మారింది. 2021లో కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రారంభించింది. ఇందులో సైకిల్-4 ఛాలెంజ్‌లో భాగంగా రెండోదశకు 11 స్మార్ట్ సిటీలు ఎంపిక కాగా వాటిలో కాకినాడ స్మార్ట్ సిటీ ఒకటి ఎంపికైంది. దీంతో సైకిల్-4 చాలెంజ్‌కోసం రూ.2కోట్లతో 3.2కిలోమీటర్ల మేర కాకినాడలో ప్రధాన ప్రదేశాలైన వివేకానంద పార్కు, ఆర్ఎంసీ గ్రౌండ్, జేఎన్టీయూ వద్ద సైక్లింగ్ ట్రాక్ సిద్ధం చేశారు. నాగమల్లితోట జంక్షన్ నుంచి పాత ఎస్పీ కార్యాలయం వరకు కిలోమీటరు పొడవున సైక్లింగ్ ట్రాక్‌ను పైలెట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేశారు. వివేకానంద పార్కు చుట్టూ సైక్లింగ్ ట్రాక్ నిర్మించారు. కాకినాడ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో స్మార్ట్‌సిటీమిషన్‌లో భాగం సైక్లింగ్‌చేసే వారికోసం సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటుచేశారు. నాగమల్లితోట జంక్షన్‌నుంచి పాత ఎస్పీ కార్యాలయం వరకు కిలోమీటరు మేర ఏర్పాటు చేసిన సైక్లింగ్‌ట్రాక్ పూర్తిగా పాడై నిరుపయోగంగా మారింది. వివేకానందపార్కు చుట్టూ ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్ పార్కుకి వచ్చేవారికి, స్కేటింగ్ రింకుకు వచ్చేవారికి పార్కింగ్ ప్లేస్‌గాను, పశువులకు రహదారిగాను మారింది. దీంతో కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన సైక్లింగ్ ఇలా నిరుపయోగంగా మారడంతో సైక్లింగ్ చేసేవారు, ప్రజాసంఘాలు, ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలి'

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్ర జ్యోతి):ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని ఉభయగోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఏఆర్వో, డీఆర్వో వెంకట్రావు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు: ఎస్పీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా, ఫొటోలు మార్ఫింగ్ చేసినా, అవమానపరిచేలా కామెంట్లు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జి.బిందుమాధవ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలు దుర్వినియోగం చేస్తూ మనోభావాలు దెబ్బతీసేలాఉంటే కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీచేశారు.

ఆనందం వరించెన్!



అప్పుడు ఏడిపించెన్...ఇప్పుడు ఠంఛన్

- తీరిన అన్నదాతల కష్టాలు
- చకచకా ఖరీఫ్ ధాన్యం సేకరణ
- 5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే
- ఠంఛనుగా చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాలో ఆనందం
- గత వైసీపీలో రైతులకు చుక్కలు
- నెలల తరబడి వేధింపులు
- నాడు ఏప్రిల్ దాటినా అరకొరే
- బాకీలు అడిగితే అరెస్టులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎన్నాళ్లకెన్నాళ్లకు..అన్నదాతలకు ఆనందం వరించెన్..బకాయిలకు ఎదురు చూపుల్లేవు.. కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరగడం లేదు.. ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో నెలలతరబడీ బ్యాంకుల వద్ద పడిగాపులు లేవు..ధాన్యం ఇచ్చిన కొన్నిరోజులకే ఏ మాత్రం ఆలస్యం లేకుండా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు.. ఇదీ కూటమి ప్రభుత్వం రాకతో జిల్లాలో మారిన అన్నదాతల పరిస్థితులు..జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం సేకరణ ఎట్టకేలకు పూర్తికాగా ఇప్పటి వరకు సేకరించిన సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నులకు అన్నదాతల ఖాతాల్లోకి ఏకంగా రూ.910 కోట్లకుపైగా కూటమి ప్రభుత్వం చెల్లించింది. ఐదేళ్ల తర్వాత తొలిసారి ధాన్యం బకాయిలకు అన్నదాతలు రోడ్డెక్కే పరిస్థితి లేకుండా ఠంఛనుగా చెల్లింపులు జరిగాయి.గత వైసీపీ ప్రభుత్వంలో ఏటా అన్నదాతలకు నరకయాతనే.

గత ఐదేళ్లూ నరకమే..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు అన్నదాతలకు ధాన్యం డబ్బుల కష్టాలు పెరిగాయి. ధాన్యం డబ్బులు 21 రోజుల్లో చెల్లిస్తా మంటూ అప్పట్లో సీఎం జగన్ వరుసగా ఐదేళ్ల పాటు గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో ఏ యేడు దీన్ని నిలబెట్టుకోలేదు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో అన్నదాతల నుంచి ధాన్యం సేక రించడం, బాకీలు నెలలు గడుస్తున్నా ఇవ్వ కుండా వేధించడం పరిపాటి.ఎవరైనా రైతులు బాకీలకు రోడ్డెక్కితే అరెస్టులు చేయించింది. చివరకు బాకీ వివరాలు సైతం బయటకు పొక్క నీయొద్దని జిల్లా జేసీలు, పౌరసరఫరాల సంస్థను ఆదేశించి గుట్టు పాటించింది. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అన్నదాతలు డబ్బులు ఇవ్వకుండా ముప్పతిప్పలు పెట్టేది. లక్ష్యం కంటే తక్కువగా సేకరించిన ధాన్యానికి రూ.1,143 కోట్ల వరకు చెల్లించాల్సి వచ్చేది. కానీ ప్రభుత్వం మాత్రం ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించిన తర్వాత మార్చి,ఏప్రిల్ దాటినా సరే చెల్లించాల్సిన బాకీల్లో సగం కూడా అన్నదాతల ఖాతాల్లోకి జమచేసేది కాదు. అటు రబీలోను ఇదే తంతు. రూ.700 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంటే వాటినీ ఇచ్చేది కాదు. ఐదేళ్ల పాటు అన్నదాతలను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారుణంగా వేధించింది. అనేక సార్లు కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అన్నదాతలు బాకీల కోసం రోడ్డెక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి సమీపంలో ఓ మండలంలో ధాన్యం బాకీ కోసం ఓ రైతు ఏకంగా ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి. ఇలా గత వైసీపీ పాలనలో అనేక మంది అన్నదాతలు నరక యాతన పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. కూటమి ప్రభుత్వంలో తొలిసారీ ఖరీఫ్ ధాన్యం సేకరణ కావడంతో ప్రభుత్వం ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకుంది.ఏ రైతుకు ఇబ్బంది లేకుండా అధికారులను అప్రమత్తం చేసింది.

ఠంఛనుగా ఖాతాల్లోకి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన తొలి ఖరీఫ్ ధాన్యం సేకరణ నేపథ్యంలో చెల్లింపులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎక్కడా లోటు పాట్లు లేకుండా ఠంఛనుగా చెల్లింపులు చేసింది.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 4.50 లక్షల మెట్రిక్ టన్నులకు రైతుల ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే జమచేసింది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అత్యధికంగా సామర్లకోట మండలంలో 35,723 మెట్రిక్ టన్నులు, కరప 19,838, పెదపూడి 19,450, కాజులూరు 17,026, జగ్గంపేట 11,792, పెద్దాపురం 8,042, కోటనందూరు మండలంలో 7,780 మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం సేక రించింది. ఎక్కడా ధాన్యం తీసుకోవడం లేదనే ఫిర్యాదు లేకుండా అన్నదాతలందరి వద్ద గింజలు సేకరించింది. జిల్లా వ్యాప్తంగా రూ.356 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి 102 మిల్లులకు అప్పగించింది.ఇందులో ఇప్పటి వరకు మొత్తం రూ.355.01 కోట్లు చెల్లించేసింది. మిగిలిన చిన్న మొత్తాలకు ఎఫ్‌టీవోలు తయారుచేసి చెల్లింపులకు పంపింది.ఇలా ఎక్కడా జాప్యం లేకుండా పక్కాగా సకాలంలో చెల్లింపులు జరిపింది. ఇలా 26,415 మంది అన్నదాతల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిం చింది. ఇందుకు రూ.523 కోట్లు చెల్లించాల్సి ఉం డగా ఇప్పటి వరకు రూ.522.71 కోట్లు చెల్లిం చింది. మొత్తం 39,180 మంది అన్నదాతల ఖాతాల్లోకి జాప్యం లేకుండా చెల్లింపులు జరి పింది.అత్యధికంగా రామచంద్రపురం మండ లంలో 28,357 మెట్రిక్ టన్నులు, పామర్రు 27,311, కపిలేశ్వరపురం 24,183, మండపేట మండలంలో 18వేలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. తూర్పుగోదావరి జిల్లాలో రూ.200 కోట్లకు పైగానే చెల్లింపులు చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏరైతును ఇబ్బంది పెట్టకుండా దాదాపు 90 వేల మందికిపైగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేసింది. దీంతో రైతులు ఆనందోత్సవాలు చేసుకుంటున్నారు. గడచిన ఐదేళ్లలో ఏనాడు డబ్బులు ఇలా సకాలంలో రాని పరిస్థితులు కళ్లారా చూసిన అన్నదాతలు కూటమి ప్రభుత్వం రాకతో ఆనాటి చీకటి రోజులు తొలగి ఎప్పటి బాకీలు అప్పుడు జమ అవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



హరియాణా-బీహార్ జట్ల మధ్య మ్యాచ్





ఆరో రోజూ అదుర్స్..

కాకినాడలో ఉత్సాహంగా కొనసాగుతున్న సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఆరో రోజూ ఉత్సాహంగా సాగింది. వివిధ మ్యాచ్‌లు 'అదుర్స్' అనిపించాయి. ఆరో రోజు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం 7 మ్యాచ్‌లు జరిగాయి. ఆరో రోజు జరిగిన హాకీ పోటీలకు కాకినాడ జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ శ్యామ్‌కుమార్, హాకీ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ హర్షవర్థన్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు. ఒడిసా, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా 5-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, బిహార్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 3-2 తేడాతో గెలుపొందింది. తెలంగాణ సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ భువనేశ్వర్, ఆర్ఎస్బీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కొచ్చి 5-0 తేడాతో విజయం సాధించింది. గోవా సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ 4-0 తేడాలో విజయం సాధించింది. ఆర్ఎస్బీ రాయపూర్, ఆర్ఎస్బీ కాన్పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కాన్పూర్ 4-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, ఢిల్లీ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 6-1 తేడాతో విజయం సాధించింది.

క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న హర్షవర్ధన్





గెలుపు సంబరాలు

ఫిట్‌నెస్సే కారణం



60 ఏళ్ల వయసులో కూడా మేము ఇంకా ఆడుతున్నామంటే దానికి కారణం ఫిట్‌నెస్. క్రీడలు పట్ల మాకున్న మక్కువ మమ్మల్ని ఈ స్థాయికి తీసుకు వచ్చింది. మేమిద్దరం జాతీయ స్థాయిలో 8 నుంచి 10 మ్యాచ్‌లు ఆడాం.

రుబీనా హర్షద్-ఎంపీ టీం కెప్టెన్, అల్కా శర్మ-ఎంపీ టీం ఉమెన్స్ మేనేజర్



అమ్మతో నేనాడుకుంటా..





కార్పొరేషన్(కాకినాడ), (ఆంధ్రజ్యోతి):

టర్ఫ్ గ్రౌండ్ స్పీడ్



టర్ఫ్ గ్రౌండ్ చాలా స్పీడ్‌గా ఉంది. ఆటగాళ్ల కదలికలు కూడా చాలా స్పీడ్‌గా ఉన్నాయి. వేగంగా వచ్చే బాల్‌ని ఆపాలంటే ఏకాగ్రత చాలా అవసరం. ఇటువంటి గ్రౌండ్‌లో ఆటను ఆస్వాదిస్తుంటాం. హాకీ టోర్నమెంట్లకు అనేక రాష్ట్రాలు వెళ్తుంటాం. అయితే కాకినాడలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో క్రీడాకారుల పట్ల మంచి ఆదరణ చూపిస్తున్నారు. ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి.

నరేష్‌కుమార్ చౌదరి, సీబీడీటీ న్యూఢిల్లీ, మెయిన్ గోల్ కీపర్

టెక్నాలజీ మారింది ఇప్పుడు



మన దేశంలో రాష్ట్రాల మధ్య జరిగే హాకీ టోర్నమెంట్లకు టెక్నాలజీ ఉండేది కాదు. 2023లో కాకినాడ వేదికగా జరిగిన సీనియర్ ఉమెన్ హాకీ టోర్నమెంట్ నుంచి ఈ టెక్నాలజీ ప్రారంభించారు. ఈ టెక్నాలజీ వల్ల ఆడుతున్న జట్లకు ఎటువంటి నష్టం జరగకుండా ఉంటుంది. అలాగే యూట్యూబ్ లింక్ ద్వారా దేశంలో ఏ రాష్ట్రంలో అయిన ఏ గ్రామం నుంచి అయిన ఆడుతున్న మ్యాచ్‌లను లైవ్ చూడవచ్చు. గతంలో మన రాష్ట్రం నుంచి నేనొక్కన్నే టెక్నికల్ ఆఫీసర్‌గా ఉండేవాడిని. ప్రస్తుతం మన రాష్ట్రం నుంచి 15 మంది జాతీయ స్థాయి టెక్నికల్ ఎంపైర్స్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయిలో టాప్ టెన్‌లో నలుగురు ఎంపైర్స్ స్కోరింగ్ జడ్జిలుగా, టెక్నికల్ ఆఫీసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో వీరంతా అంతర్జాతీయ మ్యాచ్‌లకు కూడా వెళ్లే అవకాశముంది. మన జాతీయ క్రీడ హాకీ అయినా దానికి తగిన ప్రాచుర్యం ఉండడం లేదు. తగిన పబ్లిసిటీ ఇచ్చి గుర్తింపు తెస్తే బాగుంటుంది.

హర్షవర్ధన్, ఆంధ్రప్రదేశ్ హాకీ టీం జనరల్ సెక్రటరీ, ఇంటర్నేషనల్ ఎంపైర్స్ మేనేజర్

రూ.10కే రాగిజావ

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారం ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు బయట స్టాల్



సెంట్రల్ జైలు బయట స్టాల్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రత్యేక కారాగార అధికారులు అటు మహిళా ఖైదీలకు, ఇటు జనానికి ఉపయుక్తంగా ఉండే విధంగా ఓ చక్కటి ఆలోచన చేశారు. సెంట్రల్ జైలు గేటు వద్ద రాగిజావ స్టాల్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి మాట్లాడుతూ.. జైళ్ల శాఖ కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఆదేశాలతో ఈ స్టాల్‌ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి 8.30గంటల వరకూ రాగిజావ, ఉడకబెట్టిన వేరుశెనగ, శెనగ, వెజిటెబుల్ సలాడ్‌ని రూ.10కి, బెల్లం రాగిజావ రూ.15కి అందిస్తున్నామన్నారు. మహిళా ఖైదీలతో తయారు చేయించడంతో పాటు విక్రయాలు కూడా వారే చేస్తారని ఆమె చెప్పారు. ఇప్పటికే జైలు బేకరీలో తయారైన బ్రెడ్‌లు, బిస్కెట్లు, సుధార్ పిండి వంటలు ప్రిజన్ కేఫ్‌లోను, ఆరుబయట కూరగాయలు మహిళా ఖైదీలతో విక్రయాలు జరిపిస్తున్నామని చెప్పారు. మహిళా ఖైదీలు విడుదలయిన తర్వాత ఇలాంటి అనుభవం వారి జీవనోపాధికి పని చేస్తుందన్నారు. మహిళా కారాగార ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా మహిళా ఖైదీలను ప్రోత్సహించాలని కోరారు. మంచి ఆహార అలవాట్ల వల్ల ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని, రోగాలతో ఇబ్బంది పడే పరిస్థితుల నుంచి దూరంగా ఉండొచ్చని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్య ప్రభ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జైలర్ పావని, డిప్యూటీ జైలర్ కె.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



కిలో వెండి రూ.లక్ష

- 10 గ్రాముల బంగారం రూ.80,700
- ఆల్‌టైం రికార్డుకు దిశగా వెండి ధర
- ధరల్లో పోటీపడుతున్న బంగారం, వెండి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆల్‌టైం రికార్డుకు వెండి ధర చేరింది. వెండి వ్యాపారంలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజిది. ఊహించినట్టుగానే కిలో వెండి ధర రూ.లక్ష అయింది. రాజమహేంద్రవరం మార్కెట్‌లో గురువారం కిలో వెండి ధర రూ.లక్షగా ఉంది. జనవరి 1న రూ.88,400గా ఉన్న కిలో వెండి ధర 50 రోజుల్లో రూ.11వేల600 పెరిగి రూ.లక్ష అయిపోయింది. లక్షణంగా నిలిచింది. జనవరినుంచి క్రమంగా ఈ ధరలు పెరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. బంగారం ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. 10గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర 80,700 అయింది. 24 క్యారెట్ ధర రూ.88,040 అయింది. మరో రూ.12వేలు పెరిగితే ఇదీ రూ.లక్ష కానుంది. ఈ ధరలు ఇలా విపరీతంగా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే బాగా కొనుగోలు చేసుకున్నవారు మాత్రం సంతోషంగా ఉన్నారు.

డెల్టా కాలువలకు 8700 క్యూసెక్కులు

ధవళేశ్వరం,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచిడెల్టా కాలువలకు 8700 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. తూర్పు డెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కుల చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద గోదావరినీటిమట్టం స్వల్పంగా పెరుగుదల నమోదు చేసుకుని 9.65 అడుగులకు చేరుకుంది. సీలేరునుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4వేల క్యూసెక్కులు, బైపాస్‌మార్గం ద్వారా 3వేల క్యూసెక్కులు విడుదలవుతుండగా గోదావరిలో నీటి లభ్యత 8700 క్యూసెక్కులుగా ఉంది.

కోనసీమ కపిల్‌దేవ్..

ఇక లేరు

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్‌కు పితృవియోగం
- ఖేల్‌రత్న అవార్డు స్వీకరణ చూడకుండానే తనువు చాలించిన కాశీవిశ్వనాథం



అర్జున అవార్డు ప్రకటించినప్పుడు కుమారుడికి స్వీటు తినిపిస్తున్న కాశీవిశ్వనాథం(ఫైల్)

అమలాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎందరో వ్యాయామ ఉపాధ్యాయులను..వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తీర్చిదిద్దడంలో నిరంతర శ్రామికుడిగా పేరొందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం గురువారం గుండెపోటుతో మృతి చెందారు. క్రీడలంటే ఆయన ఎంతో మక్కువతో ఉండేవారు. చివరి కోరిక తీరకుండానే తనువు చాలించడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కాశీవిశ్వనాథం పోలికల్లోగానీ, క్రీడా నైపుణ్యంలో ఆయనచూపే ప్రతిభాపాటవాలతో ఆయన్ను కోనసీమ కపిల్‌దేవ్‌గా పిలుస్తారు.

ఆ కోరిక తీరకుండానే..

అమలాపురం పట్టణానికి చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఖేల్‌రత్న అవార్డుకు ఎంపికయ్యారు. వివిధ దేశాల్లో జరుగుతున్న బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడం వల్ల ఆ అవార్డును ఇప్పటివరకు ఆయన స్వీకరించలేదు. ఈ అవార్డు స్వీకరణకు గురువారం సాయంత్రం ముహూర్తంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటికే సాత్విక్ ఢిల్లీలోనే ఉన్నారు. అవార్డు స్వీకరణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించాలని తల్లి రంగమణి, తండ్రి కాశీ విశ్వనాథ్ గురువారం ఉదయం ఢిల్లీ బయలుదేరేందుకు అమలాపురం నుంచి పయనమయ్యారు. కారులో ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన కొన్నిక్షణాల్లోనే కాశీవిశ్వనాథం గుండెపోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తుదిశ్వాస విడిచారు. కన్న కొడుకు ఖేల్‌రత్న అవార్డు స్వీకరించే కార్యక్రమాన్ని తిలకించాలనే ఆయన చివరి కోరిక తీరకుండానే మరణించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కుటుంబ నేపథ్యం..

అమలాపురం పట్టణంలోని గాంధీబజార్‌కు చెందిన రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదవీవిరమణ చేశారు. తల్లి రంగమణి జనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రామ్‌చరణ్ టెక్సాస్‌లో ఎంఎస్ చేసి ఎయిర్‌లైన్స్‌లో పని చేస్తున్నారు. చిన్నకుమారుడైన సాత్విక్‌సాయిరాజ్ చదువు కంటే షటిల్ బ్యాడ్మింటన్ ప్రాణంగా భావించి ఎనిమిదేళ్ల పసిప్రాయం నుంచేఆక్రీడకు అంకితమయ్యాడు.

తండ్రే శిక్షకుడు..

సాత్విక్‌కు తండ్రి కాశీవిశ్వనాథం చిన్నతనంనుంచే షటిల్ బ్యాడ్మింటన్‌పై శిక్షణ ఇచ్చారు. కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ ప్రకటించిన ఖేల్‌రత్న అవార్డుకు సాత్విక్‌సాయిరాజ్ ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగిందని ఇటీవలే ఓ సందర్భంలో ఆయన వ్యాఖ్యానించారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత కాశీది. తన వద్ద శిక్షణ పొందిన పద్దెనిమిదిమంది వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలుగా పనిచేస్తున్నారు.

అన్నింటా ఆయనే..

కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శిగా, అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శిగా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కాశీవిశ్వనాథం పని చేస్తున్నారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, జాతీయ వాలీబాల్ పోటీలు, క్రికెట్ పోటీలకు ఆయనే నాయకత్వం వహించారు.

ఉమ్మడి తూర్పు జిల్లాలో 12 ఎంపీడీవో పోస్టుల ఖాళీలు

- జడ్పీ సీఈవో లక్ష్మణరావు

మండపేట,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి సంబంధించి తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, మన్యం జిల్లాల్లో మొత్తం 12 వరకు ఎంపీడీవోల పోస్టులు ఖాళీగా ఉన్నాయని జడ్పీ సీఈవో ఎస్‌వీవీ లక్ష్మణరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ముగిసిన తర్వాత ఆయా మండలాలకు సంబంధించి ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. జిల్లాలో మండలపరిషత్‌ల పనితీరు మెరుగుకోసం ప్రతినెలా రెండు మండలాల్లో పర్యటించి అక్కడి ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. మండపేట మండల పరిషత్ కార్యాలయాన్ని సీఈవో గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ తీరు బాగుందని కితాబిచ్చారు. రికార్డుల నిర్వహణ, మండల స్థాయిలో ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరాతీశారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, కార్యాలయ ఏవో, వెల్లంకి నాగేంద్ర ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, జూనియర్ అసిస్టెంట్ గోపాల్ ఉన్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయానికి.. 12 నదుల పవిత్ర జలాల చేరిక



పవిత్ర నదుల జలాలను ప్రదర్శనగా తెస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 10 గంటల నుంచి వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య జరగనున్న లింగోద్భవకాల పూజల్లో భీమేశ్వర శివలింగానికి అభిషేకించేందుకు దేశంలోని 12 పవిత్ర పుణ్యనదులనుంచి సేకరించిన పవిత్ర జలాలు గురువారం సాయంత్రం సామర్లకోట ఆలయానికి చేరుకున్నాయి. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ పవిత్ర జలాలతో పిఠాపురంరాజావారి గోత్రనామాలతో స్వామికి అభిషేకించనున్నట్లు ఆలయ ఈవో నీలకంఠం, ఆలయ పండితులుసోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న తెలిపారు. పవిత్ర జలాలను ఆలయమర్యాదలతో మంగళవా యిద్యాలు వేదమంత్రోచ్చారణలమధ్య ఆ లయంలోకి చేర్చి స్వామి గర్భాలయంలో భద్రపరిచారు.

ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరానికి ఆఖరి స్థానం

అన్నవరం, ఫిబ్రవరి 20: ఆలయాల్లో భక్తులకు సంతృప్తికరమైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ప్రభుత్వం ఆలయాల్లోని ముఖ్య కూడళ్లవద్ద క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టి భక్తుల చరవాణిల ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టగా అన్నవరం దేవస్థానం చివరి స్థానంలో నిలిచింది. తొలి దశలో ఏడు ప్రధాన దేవాలయాల్లో వీటిని ఏర్పాటు చేసి సర్వే చేపట్టగా అన్నవరం దేవస్థానం 7వ స్థానంలో నిలిచింది.

పనిచేసేవారే.. వర్సిటీలో ఉంటారు

- బాధ్యతలు స్వీకరించిన నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
- కళలకు ప్రోత్సాహం.. పరిశోధనలకు ప్రాధాన్యం
- నైపుణ్యాభివృద్ధిని విద్యార్థులకు చేరువ చేస్తా
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడి



వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్ సుధాకర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆమె గిరిజన కుటుంబంలో పుట్టారు. కష్టపడి చదువుకున్నారు. 23భాషలు మాట్లాడతారు. ఇంతింతై అన్నట్టు ఎన్నో పదవులను చేపట్టి నన్నయ వర్సిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు.ఈ ప్రయాణంలో ఆమె పడిన కష్టాలు.. వర్సిటీని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడంలో ఏ విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్తారు? అనే అంశాలపై గురువారంబాధ్యతలు స్వీకరించిన ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా ఇలా చెప్పుకొచ్చారు.

రాజమహేంద్రవరం కోడలినే..

నన్నయ వీసీగా రావడం ఆనందంగా ఉంది. నేను రాజమండ్రి కోడలినే. మా మామగారు.. మా అల్లుడు ఈ ప్రాంతంవారే. మంచితనం, ప్రేమ, ఆదరణ, మర్యాదలకు ఈ ప్రాంతం పెద్దపీట వేస్తుందని అందరికీ తెలిసిన సత్యమే. నాకు కళలంటే ఇష్టం.. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో అవకాశంమేరకు కళలు ప్రోత్సహించేందుకు కృషి చేస్తా.

పనిచేసేవారు మాత్రమే ఉంటారు..

నాసిబ్బందే నా కుటుంబం. నేను పనిచేస్తాను.. సిబ్బంది అందరితో పనిచేయిస్తా. పనిచేసేవారు మాత్రమే విశ్వవిద్యాలయంలో ఉంటారు. పనిదొంగలను ఉంచుకునే అవకాశమే లేదు. పనిచేసే వారికి తొలి ప్రాధాన్యం. వర్సిటీ గురించి అంతా తెలుసుకునే వచ్చా. నాకేం తెలియదని అనుకోవద్దు.

ఇక్కడా పరిశోధనలు చేస్తా..

విశ్వవిద్యాలయంలోని వనరులను పరిశీలించి ఇక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాక పరిశోధనలను ప్రోత్సహించే విషయమై దృష్టిసారిస్తా. పరిశోధనలు చేసేందుకు ఇక్కడగల అవకాశాలు, సంభావ్యత, వాటివల్ల ఈ ప్రాంతానికి ఎంత మేరకు మేలు జరుగుతుంది మొదలైన విషయాలను పరిశీలించి పరిశోధనల వైపు దృష్టిసారిస్తా.

గిరిజన మహిళకు తొలి అవకాశం

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజన మహిళను విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా తొలిసారిగా కూటమి ప్రభుత్వం నియమించింది. ప్రతిభ ఆధారంగా వీసీలను నియమించామని తెలుపుతూ తనగురించి సీఎంచంద్రబాబు ప్రస్తావించడం ఎంతో సంతోషం కలిగించింది. నాకు ఇచ్చిన ఈ అవకాశంతో మూడేళ్లపాటు వీసీగా మరింత బాధ్యతగా పనిచేస్తా.

గిరిజన బిడ్డగా కష్టం విలువ తెలుసు

గుంటూరు జిల్లా స్టూవర్టుపురం గిరిజన ప్రాంతంనుంచివచ్చా. చదువుకోవడానికే ఎన్నో కష్టాలుపడ్డా. అన్నీఎదుర్కొని నేడు వీసీగా ఎదిగా. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టాలను అధిరోహించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి. గిరిజన బిడ్డగా కష్టం విలువతెలిసిన నేను తోటి మనిషికి సాయం చేయడానికి ముందుంటా.

19 గిరిజన భాషలకు లిపి రూపొందించా..

నేను 23 భాషలు మాట్లాడతా. ఆదివాసీల కోసం 19గిరిజన భాషలకు లిపి రూపొందించా.ఆ సందర్భంలో ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. నీ కాళ్లల్లో ఎన్ని ముళ్లు గుచ్చుకున్నాయో అంటూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నన్ను ఉద్దేశించి ఒక సందర్భంలో అనడం మర్చిపోలేను.

వీసీగా ప్రసన్నశ్రీ బాధ్యతల స్వీకరణ

అందరి సహకారంతో నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీగా గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. నన్నయ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రార్థనల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, నన్నయ కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌ల అధ్యాపకులు, నన్నయ అనుబంధ కళాశాలల నిర్వాహకులు వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి దారి కాచి... మెడపై కత్తి పెట్టి!

● బైక్‌తో సహా మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన నలుగురు దారి దోపిడీ దొంగలు అరెస్ట్

● చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న సర్పవరం పోలీసులు



నిందితులతో సర్పవరం సీఐ పెద్దిరాజు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అర్ధరాత్రి దారి కాచి మెడపై కత్తి పెట్టి బెదిరింపులకు గురిచేసి బైక్‌తో సహా మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన నలుగురు దొంగలను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేసి, నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ శ్రీనగర్‌కు చెందిన సత్తి వివేకానందరెడ్డి ఆదిత్య కాలేజీహాస్టల్‌లో ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి టీ తాగేందుకు బైక్‌పై డీమార్ట్ ప్రాంతానికి వెళ్లగా, టీ కొట్టు మూసి వేసి ఉండడంతో దుమ్ములపేట డైరీఫారమ్ సెంటర్ వైపు సూర్య బార్ రెస్టారెంట్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ మార్గమధ్యలో కాకినాడ డైరీ ఫారమ్ సెంటర్‌కు చెందిన యెలెపే మెగా శ్యామ్, రామకృష్ణారావుపేటకు చెందిన డెక్కాతి ఎల్లయ్య, సంజయ్‌నగర్ పర్లోపేటకు చెందిన కొత్తూర్తి వీరబాబు, రామకృష్ణారావుపేటకు చెందిన షేక్ ఇబ్రహీమ్‌లు అనే నలుగురు యువకులు దారికి అడ్డంగా నిలబడి బైక్‌ను ఆపారు. బాధితుడు నుంచి బైక్ తాళం లాక్కుని, బెదిరించి మెడపై కత్తి పెట్టి మోటార్ సైకిల్‌పై అక్షర స్కూల్ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ చంపుతామని బెదిరించి దాడి చేసి అతడి వద్ద ఉన్న బైక్, శ్యామ్‌సంగ్ ఎఫ్ 40 సెల్‌ఫోన్, రెండు రెడ్‌మీ ఫోన్లు, బోట్ కంపెనీ ఇయర్ బడ్స్ దౌర్జన్యంగా లాగేసుకుని పరారయ్యారు. బాధితుడు 18వ తేదీన సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో నేతృత్వంలో సర్పవరం సీఐ బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులు కాకినాడ దుమ్ములపేట కూరకాయల మార్కెట్ వద్ద ఉండగా పోలీసులు దాడి చేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా సత్వరంగా పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్, క్రైం సిబ్బంది, ఏఎస్‌ఐ నాగేశ్వరరావు శ్రీనివాస్, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, ప్రసాద్, పీసీలు వెంకటరత్నం,దుర్గాప్రసాద్, అనిల్, కిషోర్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

ఒకరి పాపం 12 మందికి చుట్టుకుంది!

● బయటపడుతున్న కాకినాడ జీజీహెచ్ మేనేజర్ లీలలు ● విధుల నుంచి చిరుద్యోగుల తొలగింపు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో పరిపాలనా విభాగ మేనేజర్‌గా పనిచేసిన నరసింగరావ్ అప్పట్లో చేసిన పాపం 12 మంది చిరుద్యోగులకు చుట్టుకుంది. శాఖాపరమైన విచారణ, దర్యాప్తు అనంతరం ఆ చిరుద్యోగులను గురువారం విధుల నుంచి తొలగించారు. 2020-2021లో కొవిడ్ నియంత్రణలో లేని సమయంలో తన తెలివితేటలతో లేని ఉద్యోగాలను సృష్టించి జీజీహెచ్‌లో నియామక ప్రక్రియకు తెరతీసిన మేనేజర్ నరసింగరావును అధికారులు విచారణానంతరం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయన పై అధికారిణి (రాజమహేంద్రవరం) శాఖాపరంగా ఆయనపై సరైన చర్యలు చేట్టకపోవడంతో ఆయన త్వరలోనే తిరిగి ఉద్యోగం పొందేందుకు పావులు కదుపుతున్నాడు. అయితే నరసింగరావ్ చేసిన పాపానికి 12 మంది బలవ్వడం మిగతా ఉద్యోగులను, ఉద్యోగ సంఘాలను కలచి వేసింది. ఉద్యోగం కోల్పోయినవారిలో ఇద్దరు రెగ్యులర్ ఫార్మసిస్ట్‌లు, మరో ఇద్దరు కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్‌లు, ఇద్దరు ఫిజియోథెరపిస్ట్‌లు, నలుగురు ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఒక థియేటర్ అసిస్టెంట్, ఒక ఎలక్ట్రీషియన్ ఉన్నారు. ఈ విషయంపై అధికారులు తొలగింపునకు గురైన వారి కోసం కలెక్టర్‌కు విన్నవించగా వారికి మరి ఎక్కడైనా నియామకం చేపట్టే అవకాశం గురించి పరిశీలించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఈ విషయంపై జీజీహెచ్ అధికారులు, ట్రెజరీ అధికారులతో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. చిరుద్యోగుల జీవితాలతో ఆడుకుని సస్పెండ్‌కు గురైన నరసింగరావును పూర్తిగా ఉద్యోగం నుంచి తొలగించాలని పలు ఉద్యోగసంఘాలు కోరుతున్నాయి.

శానిటరీ మేస్త్రీపై వ్యక్తి దాడి

పిఠాపురంలో విధులు బహిష్కరించి పారిశుధ్య కార్మికుల ఆందోళన



పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది, కార్మికులు

పిఠాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో విధుల్లో ఉన్న శానిటరీ మేస్త్రీపై ఒక వ్యక్తి దాడి చేయడంతో పాటు వెంబడించి మరీ మరోమారు దాడి చేశాడు. ఈ సంఘటనకు నిరసనగా పారిశుధ్య కార్మికులు గురువారం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తున్న పొట్నూరి పైడిరాజు 24వ వార్డు పక్షలు మర్రిచెట్టు ఏరియాలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం సాయంత్రం పర్యవేక్షిస్తున్నారు. ఆ సమయంలో నాగేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి దాడి చేయడంతో పాటు కులదూషణకు దిగాడు. అక్కడ నుంచి చెత్త తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌ను వెంబడించి వచ్చి మరీ మున్సిపల్ కార్యాలయం వద్ద మరోమారు దాడికి దిగాడు. ఈ సంఘటనపై పైడిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేస్త్రీపై దాడి ఘటనకు నిరసనగా మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది, కార్మికులు గురువారం విధులు బహిష్కరించారు. దాడి చేసిన వ్యక్తిని తక్షణం అరెస్టు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. అతడిని అరెస్టు చేసే వరకూ తాము విధులకు హాజరుకాబోమన్నారు. వారి ఆందోళనతో పిఠాపురం పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ నిలిచిపోయింది. ఎక్కడ చెత్తాచెదారం అక్కడే ఉండిపోయింది.

డిప్యూటీ సీఎం పవన్‌పై అనుచిత పోస్టులు

కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, తప్పుడు పోస్టులు పెడితే ఉపేక్షించబోమని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. డిప్యూటీ సీఎం పవన్ కుటుంబ సభ్యులతో కుంభ మేళాలో పుణ్యస్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. ఈ ఫొటోలను కొందరు మార్ఫింగ్, బాడీ షేమింగ్ చేయడంతోపాటు, మహిళలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ జనసేన నాయకులు ఫిర్యాదు చేశారని ఎస్పీ తెలిపారు. భార్గవ్. ఆర్, ఎన్‌టీఆర్ భక్తుడు, దిలోన్ పోల్స్10 ఐడీల నుంచి ఉన్న పోస్టుల ఫొటోలను ఫిర్యాదుతో జత చేయడం జరిగిందన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితులను గుర్తించి కోర్టులో ప్రవేశ పెడతామన్నారు.

ముగిసిన ఆక్టోపస్ శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద నిరోధక సంస్థ అయిన ఆక్టోపస్ కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో చేపట్టిన 2 రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. 40 మంది కమాండోలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ సి.రాజారెడ్డి నేతృత్వంలో ఆర్‌ఐలు ఎస్.మురళీకృష్ణ, కె.మహేష్ ఆధ్వర్యంలో ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడితే తిప్పి కొట్టే విధానాలపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ, డా.ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా.డిఎస్‌విఎల్ నరసింహం ఆదేశానుసారం వైస్ ప్రిన్సిపాల్ డా.శశి, ఫోరెన్సిక్ అసోసి యేట్ ప్రొఫెసర్ డా పి. ఫణికిరణ్, ఆర్‌ఎంసీ లైబ్రేరియన్ లక్ష్మణ్ రెడ్డి, కళాశాల తరుపున శిక్షణా కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. ఇలాంటి ఉన్నత విద్యను అందించే కళాశాలల్లో ఇటువంటి శిక్షణలనివ్వడం తప్పనిసరి అని ఏఎస్పీ పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన ఏపీ ప్రభుత్వ పెద్దలు



ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని కలిసిన సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల అనంతరం జాప్యం లేకుండా పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ పెద్దలు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు తదితరులు జలశక్తి మంత్రిని కలిశారు. పోలవరంతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఏపీ అభివృద్ధి పోలవరం ప్రాజెక్టుతో ముడిపడి ఉందని వివరించారు. అపారమైన జలవనరులు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని మంత్రిని కోరారు.

భర్తను కాదనుకొని.. మరొకరితోనూ పొసగక!

ఉరి వేసుకొని మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన ఓ మహిళకు అదే ప్రాంతానికి చెందిన దేవయ్యతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. ఏడాది తర్వాత రాజమండ్రికి చెందిన అవివాహితుడు శరత్ కుమార్‌తో సామాజిక మాధ్యమం ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఏడాది కొనసాగిన తర్వాత ఆమె పిల్లలను తీసుకుని రాజమండ్రి వచ్చేసింది. అప్పటి నుంచి హౌసింగ్ బోర్డులో అద్దెకు తీసుకున్న ఇంట్లో ఆమె, శరత్ కుమార్ సహజీవనం చేస్తున్నారు. అయితే 3 నెలల నుంచీ వీరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో తాను చచ్చిపోతానంటూ శరత్‌తో చెప్పింది. గొడవ జరిగినప్పుడు ప్రతిసారీ ఆమె అలా బెదిరించడంతో ఇప్పుడు కూడా అదే మాదిరి అనుకొని శరత్ కుమార్ ఉద్యోగానికి వెళ్లిపోయాడు. గురువారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేసరికి ఆమె ఉరికి వేలాడుతూ ఉంది. బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మరణించడంతో... మనస్తాపానికి గురై!

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విశ్రాంత ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక నరసన్నగర్, సిరి అపార్ట్‌మెంట్‌కు చెందిన గోపిశెట్టి నాగేశ్వరరావ్ (65)కు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా నాగేశ్వరరావ్ కాకినాడ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో టెక్నీషియన్‌గా పని చేసి 5 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. కుమారుడు, కుమార్తె విదేశాల్లో స్థిరపడడంతో నాగేశ్వరరావు తన భార్య విజయలక్ష్మితో కలిసి కాకినాడలో ఉంటున్నారు. అయితే ఇటీవల నాగేశ్వరరావ్ తల్లి మరణించడంతో తల్లితో ఎంతో అనుబంధం ఉండడంతో తీవ్ర మనస్తాపానికి గురై అతడిలో అతడే మదనపడిపోయి, పరాకు మాట్లాడేవాడు. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి తన భర్తను మానసిక వైద్యుడికి చూపిద్దామనుకున్న తరుణంలో గురువారం ఆమె నిద్రిస్తున్న సమయంలో నాగేశ్వరరావ్ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు బెల్టుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన విజయలక్ష్మి పొరుగింటి వారి సహాయంతో జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. టూటౌన్ ఎస్‌ఐ ఎం వెంకటేశ్వరరావ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య, మామపై కత్తితో దాడి

● దురాగతానికి పాల్పడ్డ అల్లుడు

● అక్కడికక్కడే భార్య మృతి, మామకు తీవ్ర గాయాలు

● కుటుంబ కలహాలే కారణం



రక్తపు మడుగులో పడివున్న కృష్ణతులసి మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యను, మామను కత్తితో అల్లుడు దాడిచేసిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. కొవ్వూరు మండలంలోని వాడపల్లి బంగారమ్మపేటకు చెందిన అడ్డాల నాగయ్యకు నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె, కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా, మిగతా ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. ఇందులో మూడో కుమార్తె గంధ్ర కృష్ణతులసి (37)కు కృష్ణా జిల్లా తిరువూరు సమీపంలోని రాజుగూడెంకి చెందిన గంధ్ర మురళీకృష్ణ చౌదరితో 16 సంవత్సరాల క్రితం రెండో వివాహం జరిగింది. అయితే మురళీకృష్ణ, కృష్ణతులసి కొంత కాలం సఖ్యంగానే ఉన్నారు. అనంతరం గొడవలు జరగ్గా కృష్ణతులసి పుట్టింటికి వచ్చేసింది. గత నాలుగు నెలలుగా భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. మురళీకృష్ణ బంగారంపేట గోదావరి ఏటిగట్టుపై వద్ద గల బస్‌షెల్టర్ పక్కన కొబ్బరి బొండాల షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తండ్రి నాగయ్యతో కలిసి కృష్ణతులసి గోదావరి ఏటిగట్టు కింద కట్టిన గేదెల వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా, కొబ్బరి బొండాల షాపు వద్ద ఉన్న భర్త మురళీకృష్ణను చూసి తన తండ్రి వద్ద గతంలో అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని కోరింది. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన మురళీకృష్ణ తన చేతిలో ఉన్న కొబ్బరి బొండాల కత్తితో దాడి చేయగా కృష్ణతులసి అక్కడికక్కడే మృతిచెందింది. ఆ తర్వాత వచ్చిన మామ నాగయ్యనూ మెడపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్, పట్టణ ఎస్‌ఐ కె. జగన్మోహనరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన నాగయ్యను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రి లో చేర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణతులసికి మొదటి భర్తకు ఒక కుమారుడు ఉన్నాడు. పని నిమిత్తం భీమవరం వెళ్లాడు. మృతురాలి సోదరుడు అడ్డాల సూర్యభాస్కర్ అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చైతన్యరాజుకు మాతృవియోగం

●నివాళులర్పించిన ప్రముఖులు



లక్ష్మీకాంతమ్మ

అమలాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ వైద్య విద్యాసంస్థల అధినేత కలిదిండి వీరవెంకట సత్యనారాయణరాజు (చైతన్యరాజు)కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి లక్ష్మీకాంతమ్మ (87) గురువారం మధ్యాహ్నం అమలాపురంలోని కిమ్స్ వైద్యకళాశాలలో ఆకస్మికంగా మృతిచెందా రు. ఆమె భర్త సత్యనారాయణరాజు ఇదివరకే మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు. వారిలో చైతన్యరాజు పెద్దకుమారుడు. కాగా రెండో కుమారుడైన వెంకట్రామరాజు కొంతకాలం క్రితం మృతిచెందారు. ఆమెకు వరలక్ష్మీ, పార్వతి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వృద్ధాప్యంలో ఉన్న లక్ష్మీకాంతమ్మ కిమ్స్‌లోని వైద్యుల సంరక్షణలోనే కొన్నిరోజులుగా ఉన్నారు. లక్ష్మీకాంతమ్మ భౌతికకాయానికి శుక్రవారం రాజమహేంద్రవరంలోని గోదావరి నదీ తీరాన అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. లక్ష్మీకాంతమ్మ మరణ వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ప్రముఖులు పెన్మెత్స జగ్గప్పరాజు, దంతులూరి వాసురాజు, బీజేపీ నాయకులతో సహా అనేకమంది పరామర్శించి లక్ష్మీకాంతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

దేవరపల్లిలో జర్మన్ ప్రతినిధుల బృందం

● మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



పల్లంట్లలో ఆకుకూరలు సాగు చేస్తున్న సత్యవర్థినిని వివరాలు అడుగుతున్న బృంద సభ్యులు

దేవరపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో జర్మన్ ప్రతినిధుల బృందం గురువారం పర్యటించింది. దేవరపల్లి మండలంలోని పల్లంట్ల, యర్నగూడెం, కురుకూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పండించే పంటల గురించి ఆ బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఈ బృందంలో ఫౌండేషన్ ఆన్‌ఫ్యూచర్ ఫార్మింగ్ తరఫున జాస్పర్ జోర్డాన్, బెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కౌటినో, అటెలియర్‌ఫుడ్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకస్ కేష్లే ఉన్నారు. దీనిలో భాగంగా యర్న గూడెంలో రైతు గద్దే మునేశ్వరరావు తన తొమ్మిది ఎకరాల్లో పప్పుధాన్యాలు, 35 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్న పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పాటించడానికి మీ లక్ష్యమేమిటని అడిగారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు భూసారాన్ని పెంపొందించుకోవచ్చని, అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని రైతు మునేశ్వరరావు జర్మన్ బృందానికి తెలిపారు. తమ ప్రకృతి వ్యవసా యం ద్వారా పండించే పంటకు స్వయంగా ప్రకృతి సాగు పదార్థాలైన ద్రవజీవామృతం తయారు చేసుకోవడం, డ్రోన్ పిచికారీ సాంకేతికత జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. పల్లంట్లలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కౌలురైతు సీహెచ్. సత్యవతి ఎకరం భూమిని కౌలుకు తీసుకుని అన్ని రకాల ఆకుకూరలు, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ అధికలాభాలు సాధిస్తున్న అంశాన్ని జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. వీరితోపాటు రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు ప్రకాశ్‌రావు, శ్రీనివాసరావు, ఏపీసీఎన్‌ఎఫ్ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వలి, హుమాయున్, యశ్వంత్‌రెడ్డి, దేవరపల్లి మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రతినిధులు సీతాదేవి, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వృద్ధ దంపతులను మభ్యపెట్టి... ఆపై బంగారం దోచుకెళ్లి

● నిందితుడి అరెస్టు



దొంగను అరెస్టు చేసిన ఎస్‌ఐ

కొత్తపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట శివారు పనసలదొడ్డికి చెందిన గుబ్బల వెంకటేశ్వరరావు ఇంటికి ఒక అగంతకుడు వచ్చి మీకు బియ్యం యోజన కింద లోన్ వచ్చిందని, తాను సచివాలయం నుంచి వచ్చానని చెప్పి నమ్మబలికావు. దాంతో వారిద్దరినీ ఆ అగంతకుడు మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదుసెంటర్‌కు తీసుకుకొచ్చి దించాడు. ఇక్కడే కూర్చోండి మీ ఇంటికి వెళ్లి ఆధార్ జిరాక్స్ తీసుకుని వస్తానని తిరిగి మళ్లీ పనసలదొడ్డిలో వారు ఉంటున్న ఇంటికి వెళ్లాడు. మీ నాన్నకు లోను వచ్చిందని మీ ఆధార్‌కార్డు, ఫొటో కావాలని వారి కుమార్తెను అడగ్గా ఆమె ఆధార్‌కార్డు తెచ్చిఇచ్చింది. ఫొటో లేదని చెప్పగా , అయితే నేను ఫొటో తీసుకుంటానని చెప్పి మీ మెడలో ఉన్న చైన్, ఉంగరం ఫొటోలో రాకూడదు, వాటిని తీసి పక్కన పెట్టమని చెప్పాడు. ఆ తర్వాత ఫొటో తీసినట్టు నమ్మించి పక్కన పెట్టిన కాసు బంగారం చైను, అరకాసు ఉంగరాన్ని జేబులో పెట్టుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో మోసం జరిగిందని గ్రహించిన వృద్ధ దంపతులు కొత్తపేట పోలీసులకు సమాచారం అందించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు రాజోలు మండలం శివకోడుపాలానికి చెందిన యల్లమిల్లి వెంకటరమణ అలియాస్ గ్రాబియేల్, అలియాస్ కిషోర్‌గా గుర్తించారు. నిందితుడ్ని బుధవారం రాత్రి బోడిపాలెం వంతెన సమీపంలో పట్టుకుని బంగారాన్ని రికవరీ చేసి అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా నిందితుడిపై గతంలో ఈ ప్రాంతంలోనే ఇటువంటి చోరీలకు సంబంధించి 22 కేసులు ఉన్నాయని ఎస్‌ఐ చెప్పారు.

కుమారపురంలో కత్తితో దాడి : ఒకరికి గాయాలు



గాయపడిన శ్రీనివాసరావు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం కుమారపురంలో కత్తితో చేసిన దాడిలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలివి. గ్రామానికి చెందిన టీ.రామకృష్ణ భార్యను అదే గ్రామానికి చెందిన టీ.అనంతయ్య పరుష పదజాలంతో దూషిస్తున్నాడు. అయితే అటుగా వెళుతున్న రామకృష్ణ సోదరుడు శ్రీనివాసరావు అతన్ని వారించే ప్రయత్నం చేయగా, ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన అనంత య్య ఇంట్లో నుంచి కత్తి తెచ్చి శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో శ్రీనివాసరావు తలపై తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



నాగేంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

గండేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామపరిధిలోని ఒక పొలంలో రంగంపేట మండలం పెద రాయవరం గ్రామానికి చెందిన కాకర్ల నాగేంద్ర (34) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం నాగేంద్ర రాయవరం గ్రామం నుంచి పశుగ్రాసం కోసం వచ్చి కోసుకుని మోపులు తీసుకుని వెళ్తుండగా, పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది, ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌సాగర్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించినట్టు ఎస్‌ఐ శివనాగబాబు తెలిపారు.నాగేంద్రకు భార్య మహేశ్వరి, కూతుళ్లు మోక్షశ్రీ, శ్రీలక్ష్మీసుకన్య ఉన్నారు. కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యుత్ శాఖ అధికారులు వైర్లు చేతికందే ఎత్తులో లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి'

పిఠాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాలకు చెందిన నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబీ, ఉపాధ్యక్షురాలు సీహెచ్.గీతలు డిమాండ్ చేశారు. పిఠాపురంలో గురువారం కాకినాడ జిల్లా ఏఐవైఎఫ్ సమావేశంలో వారు మాట్లాడారు.

బీచ్ పరిశుభ్రంగా ఉంచేలా కృషి


బీచ్‌లో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న భావన

కమిషనర్ భావన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోన్న కాకినాడ బీచ్‌ని పర్యాటకులకు మరింత ఆహ్లాదం పంచేలా పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ భావన కోరారు. గురువారం కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్, యుద్ధ మ్యూజియం పరిసర ప్రాంతాల్లో జరుగుతోన్న అభివృద్ధి, పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. బీచ్ అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో భాగంగా సాగర తీరాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాగరతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా కృషి చేయాలన్నారు. బీచ్‌లో శానిటేషన్ నిర్వహణ గ్రామ పంచాయతీ చూసుకోవాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. యుద్ధ విమాన మ్యూజియం, పరిసరాలు పరిశీలించి, అసంపూర్తి నిర్మాణ పనులు ఉంటే సత్వరంగా పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ కామేశ్వరరావు, ఎంఈ మత్స్యరాజు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ రామారావుపేట, సుబ్బయ్య హోటల్ రోడ్డు, పీఆర్ కళాశాల రోడ్డులోని ఈట్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిర్వాహణను గురువారం తెల్లవారుజామున కమిషనర్ భావన పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, అధికారులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించాలి

కొత్తపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కాకినాడ డీఎల్పీవో టీ.అన్నామణి అన్నారు. కొత్తపల్లి మండలంలో ఉప్పాడ, కొత్తపల్లి, కొండెవరం గ్రామాల్లో ఉన్న చెత్త సందప కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద సేకరించిన తడి, పొడి చెత్తను చెత్తసంపద కేంద్రాలకు తరలించి వానపాములతో వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. వివిధ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. చెత్తసంపద కేంద్రాలున్న ప్రాంతాలు తెలియసేందుకు గ్రామాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తడి,పొడి చెత్తను వేరే చేయడంపై ఎప్‌టీసీ రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ ఉన్నారు.


ఉప్పాడలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

'అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను శిక్షించాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కువైట్‌లో జీవనోపాధి పొందుతున్న శెట్టిబలిజ కుల మహిళలపై తీవ్రమైన పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కాకినాడ జిల్లా శెట్టిబలిజ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కాకినాడ ఎస్‌డీపీవో, ఐపీఎస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ శెట్టిబలిజ కుల మహిళల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను రెడ్ కార్నర్ నోటీసు ద్వారా రప్పించి కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు విషయాన్ని తెలియజేసి శెట్టిబలిజ కుల మహిళలపై దూషణలకు పాల్పడిన దోషులకు ఉపేక్షించకూడదని కోరారు. కార్యక్రమంలో జిల్లా శెట్టిబలిజ సంఘం నాయకులు యనమదల రవి, కండిపల్లి వెంకటరమణ, పెంకే రాజు, అనసూరి సతీష్, కొండా వినాయక్, రాయుడు దుర్గ, దొడ్డి వీరే oద్ర, వాసంశెట్టి త్రిమూర్తులు, కాదా శివరామకృష్ణ, పెంకే శివ, ఇళ్ల భవాని, అప్పలరాజు ఉన్నారు.

విద్యాశాఖ ఏడీ తనిఖీలు


సమీక్ష నిర్వహిస్తున్న ఏడీ

పెద్దాపురం/సామర్లకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లి విద్యాశాఖ అసిస్టెంట్ డైరక్టర్ వై.వినయ్‌మోహన్ గురువారం పెద్దాపురంలో పలు మున్సిపల్ పాఠశాలలను తనిఖీ చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల, కందుకూరి వీరేశలింగం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్నా భోజనం స్వీకరణ, విద్యాఫలితాల తీరు, విద్యాబోధన, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రతలపై ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలలకు ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేవరకూ గుడ్లు పంపిణీ నిరంతరంగా కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చేసినా ప్రధానోపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈవో చౌదరి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. కరప గ్రామానికి చెందిన శివకోటి బాలరాజు(49) బుధవారం సాయంత్రం కరప పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజు ఎడమ చెయ్యి నుజ్జుయిపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. అపస్మారకస్థితిలో ఉన్న బాధితుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సునీత వివరించారు.

వాహనాల తనిఖీ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ దేవరాజ్‌మనీష్ ఆదేశాలతో సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో మహిళల వద్ద చైన్లను లాక్కెళ్లే దొంగలు తిరుగుతున్నారనే సమాచారంతో ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు చేపట్టినట్టు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. చీడిగ, ఇంద్రపాలెం, కొవ్వాడ గ్రామాల్లో వాహనాలను తనిఖీచేసి నెంబర్లులేని 20 వాహనాలను పట్టుకుని వాటిపై సుమారు రూ.22,000 జరిమానా విధించామన్నారు. గ్రామాల్లోని మహిళలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ వీరబాబు, ట్రైనీ డీఎస్పీ జీవన సూచించారు.

సినీ గాయకుడు రామాచారి ప్రత్యేక పూజలు


వేదాశీర్వచనం పొందుతున్న రామాచారి

సామర్లకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు కమండూరి రామాచారి గురువారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వరస్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మవార్లకు విశేష పూజల అనంతరం నందిమండపం వద్ద పండితులచే వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు. జ్యోతిష్యులు చీమలకొండ ప్రసాద్, బడుగు సీతారామ బాలాజీ, గిడుతూరి శ్రీను తదితరులున్నారు.

ఘనంగా 'ఉత్సవ్-2కే 25'

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీనగర్‌లోని ఆదిత్య పాఠశాల 41 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉత్సవ్- 2కే 25 పేరిట గురువారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదిత్య చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ టి.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పడాల ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సూర్యప్రసాద్, గౌరవ అతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్‌ఐ కరుణప్రియాంక పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ 41ఏళ్లుగా ఆదిత్య ఎన్నో విజయాలు సాధించిందన్నారు. సూర్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కూటమి అభ్యర్థి విజయానికి సహకరించాలి

పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యేలు, కూటమి నాయకుల ప్రచారం


కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు, పాల్గొన్న అభ్యర్థి రాజశేఖర్


పెద్దాపురంలో ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కుడా చైర్మన్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి సహకరించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక సాంబమూర్తినగర్‌లో గురువారం కాకినాడ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి రాకముందు జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించేవిధంగా పట్టభద్రులు కృషి చేశారన్నారు. అదే స్ఫూర్తితో ఈ నెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు జోసఫ్ బెన్నీ, ప్రతాప్ సిన్హా, శామ్యూల్ సాగర్, విక్టర్ శామ్యూల్, సురేంద్ర కుమార్, ఇసాక్ రాజ్, విజయ్‌కుమార్, జాన్ కిస్టోఫర్, సీరం ఇస్సాక్, స్టీఫెన్, టీడీపీ నాయకుడు కొల్లాబత్తుల అప్పారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్(కాకినాడ): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. కాకినాడలో తన క్యాంపు కార్యాలయంలో పేరాబత్తులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 8నెలల్లో విశేషమైన అభివృద్ధి జరిగిందని, రూ.11లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆరున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఉద్యోగులకు టాక్స్ మినహాయింపు లభించిందన్నారు.

సర్పవరం జంక్షన్: రాష్ట్రంలో కూటమిప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని, గ్రాడ్యుయేట్ ప్రయోజనాలు కోసం కూటమి తరపున పోటీచేస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. అర్బన్ పరిధిలోని 1,2,3 42, 28, 49, 50వ డివిజన్లలో కూటమి నాయకులతో కలసి గ్రాడ్యుయేటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. గౌడ్‌కార్పొరేషన్ డైరెక్టర్ ప్రకాశ్‌గౌడ్, కో కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ, మాజీ కార్పొరేటర్లు పేరాబత్తుల లోవబాబు, పలివెల త్రిమూర్తులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు అన్నారు. తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తల సమావేశం మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మందాల గంగసూర్యనారాయణ, మోపూరి వెంకటేశ్వరరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, ముత్యాల జయలక్ష్మి పాల్గొన్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పటవల ఫైడా కళాశాలలో పేరాబత్తుల రాజ శేఖర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పరిశీలకులు పూతి కోటేశ్వరరావు, సత్తిబాబు, కూటమి నాయకులున్నారు.

గొల్లప్రోలు: ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు కోరారు. గొల్లప్రోలులోని మార్కండేయపురం, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

పిఠాపురం: పేరాబత్తుల రాజశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విజ్ఞప్తి చేశారు. పిఠాపురం 23, 24వ వార్డుల్లో వారు ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో విజయం చేకూర్చాలని మాజీ ఎమ్మెల్యే వర్మ కొండెవరంలో ప్రచారం నిర్వహించారు. పీబీసీడీసీ2 చైర్మన్ అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ ఎంపీపీ వివై దాసు, ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, మాజీ ఎంపీటీసీలు గాది రాజబాబు, కూరాకుల సుధాకర్, గాది సత్తిపండు పాల్గొన్నారు.

కరప: కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి అందరూ సమష్టిగా పనిచేయాలని మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ కాకినాడజిల్లా ప్రధానకార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా సూచించారు. కరప మండలం గొర్రిపూడి, యండమూరు గ్రామాల్లో గురువారం వారు కూటమి నాయకులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అధికారులు, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేశారు. నాయకులు దేవు వెంకన్న, గండి వెంకటేశ్వరరావు, జోకా అప్పలరాజు, అనుకుల రాంబాబు, పలివెల జానకిరామయ్య, పుణ్యమంతుల గంగరాజు, ఓలేటి సూర్యనారాయణ, సర్వసిద్ధి ఏడుకొండలు పాల్గొన్నారు.

పెద్దాపురం/సామర్లకోట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి పెద్దాపురంలో ప్రచారం నిర్వహించారు. రాజశేఖర్‌కు మద్దతుగా కరప త్రాలను లూథరన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు, సిబ్బందికి అందజేశారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, బొళ్ల వెంకటరమణ, పరిశీలకులు సాయికృష్ణ పాల్గొన్నారు.


తాళ్లరేవు: ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



సర్పవరం జంక్షన్: వివరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ


పిఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు

● ఎస్పీ బిందుమాధవ్ ● భీమేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన


సామర్లకోట భీమేశ్వరాలయంలో శివలింగాన్ని అభిషేకిస్తున్న ఎస్పీ

సామర్లకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయంలో భక్తులకు వివిధ సదుపాయాల కల్పనలో భాగంగా జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గురువారం ఆలయాన్ని సందర్శించారు. కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణిలతో బాటూ ఆలయ ఆవరణలో క్యూలైన్లు ఏర్పాట్లు, సాధారణ భక్తులకు దర్శనాలు, వీవీపీలకు దర్శనాల ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణ భగవాన్‌కు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసమైతే సామర్లకోట మీదుగా కాకినాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను దారి మళ్లించే యోచన చేస్తున్నామన్నారు. ఎస్పీకి ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా ఆగతం పలికారు. భీమేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లకు విశేష పూజల అనంతరం నంది మండపం వద్ద పండితులచే వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు. ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) తదితరులు ఉన్నారు.

డ్రోన్, సీసీ కెమెరాలతో నిఘా

పిఠాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాల సమయంలో భక్తుల రద్దీని గమనించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు వీలుగా డ్రోన్, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచుతామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వెల్లడించారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు చేయాల్సిన బందోబస్తు ఏర్పాట్లుపై ఆయన గురువారం పరిశీలన జరిపారు. మహాశివరాత్రి ఉత్సవాలకు, పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు, కుక్కుటేశ్వరస్వామి దర్శనాలు, పిండప్రదానాలు, మూసివాయినాలు కోసం భక్తులు బా రీగా తరలివచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏఎస్పీ బందోబస్తును నిరంతరం పర్యవేక్షిస్తారని చెప్పారు. సీసీ కెమెరాలను అన్ని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తులకు సూచనలు ఇచ్చేం దుకు ఎప్పటికప్పుడు లౌడ్‌స్పీకర్లు ద్వారా అనౌ న్స్‌మెంట్‌లు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు మణికుమార్, జానీభాషా, రామకృష్ణ, గుణశేఖర్ ఉన్నారు.


పిఠాపురం పాదగయలో ఉత్సవాల బందోబస్తు కోసం పరిశీలన చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

పాడా పీడీ సమీక్ష

పాదగయ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉత్సవాల విజయవంతానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.శ్రీధర్ తెలిపారు. పాదగయలో కొలువయి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 24నుంచి 28 వరకూ జరిగే కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఏర్పాట్లుపై ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశానికి ముందుగానే సమాచారం ఇచ్చినా ముగ్గురు అధికారులు మినహా ఎవ్వరు హాజరుకాకపోవడంపై పీడీ శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం అందరిని సమావేశానికి రప్పించాలని పాదగయ అధికారులను ఆదేశించారు. అయినప్పటికి అన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం. సమావేశంలో ఏపీడీ వసంతలక్ష్మి, మునిసిపల్ కమిషనరు కనకారావు, పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎంపీడీవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏ.ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే భీమ్‌నగర్ 11కేవీ ఫీడర్‌పై లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా చిట్టోడి తోట, మంగాయమ్మరావుపేట, కరివేపాకుపేట, సీతయ్యగారి తోట, విద్యుత్‌నగర్, రాజుగారికోట, మునిసిపల్ కార్యాలయం, మార్కెట్, విరవాడ రోడ్డు, యానాదుల కాలనీ, పాదగయ, కత్తులగూడెం, కాకినాడ రోడ్డు, కొండప్ప వీధి, చిత్రాడ బ్రిడ్జి, పాలిటెక్నిక్ కళాశాల, జడ్జి క్వార్టర్స్, ప్రభుత్వాసుపత్రి, రూరల్ పోలీసుస్టేషన్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, సామర్లకోట రోడ్డు, గురుకుల పాఠశాల, పక్షులమర్రిచెట్టు సెంటర్, సకలయ్యచెరువు, గాంధీబొమ్మ సెంటర్, నూకాలమ్మ గుడి వీధి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటలు నుంచి 12గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

కొత్తపల్లి: కొత్తపల్లి 33/11కేవి సబ్‌స్టేషన్ పరిధిలో కొమరగిరి ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఈ క్రింది గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏ.ప్రభాకర్ పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు కొమరగిరి, గోర్స, చిన, పెద కలవలదొడ్డి, నిదానందొడ్డి గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

సామర్లకోట: సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏ.ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ఉప్పువారి సత్రం, జల్లూరు ఫీడరు, టిడ్కో గృహాలు, పిఠాపురం రోడ్డు వ్యవసాయావసరసర్వీసులకు సరఫరా ఉండదన్నారు.

కలెక్టరేట్(కాకినాడ): కాకినాడ డీ2 సెక్షన్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని కాకినాడ విద్యుత్ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సంజయ్‌నగర్, పర్లోవపేట, రాజీవ్‌గృహ కల్ప అపార్ట్‌మెంట్స్, వార్ఫ్‌రోడ్, బుడంపేట, సూర్యానారాయణపురం, తిలక్‌స్ట్రీట్, రంగయ్యనాయుడు వీధి, పాతపోర్టు రైల్వేస్టేషన్ విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

23న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సామర్లకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల శతాబ్ది వేడుకలు పురస్కరించుకుని ఈ నెల 23న సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థుల ఆత్మీయ, అపూర్వ సమ్మేళనం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వేడుకల నిర్వాహక కమిటీ అధ్యక్షుడు, పారిశ్రామికవేత్త పసల పద్మ రాఘవరావు, కమిటీ కార్యదర్శి కెఎస్ఎన్.మూర్తి, రాష్ట్ర లేబర్‌సెల్ మాజీ అధ్యక్షుడు దవులూరి సుబ్బారావు, రెడ్నం లక్ష్మీపతి వెల్లడించారు. గురువారం సామర్లకోటలో వారు మాట్లాడుతూ వెయ్యిమంది పూర్వ విద్యార్థులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. గద్దే రాంబాబు, సత్తార్‌గంధం రామకృష్ణ, యెంద్రు ప్రభాకర రావు, నిమ్మకాయల బాబూరావు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో జరుగుతున్న 20వ సప్తాహ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. కలశస్థాపన కార్యక్రమంలో జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి దంపతులు పాల్గొని తొలి రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ, ఇతర పూజా కార్యక్రమాల అనంతరం 168 గంటల పాటు నిరంతరం జరిగే భజన కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి పెదబాబీ, పీబీసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ దువ్వ కొండ, మొగలి రామ్మూర్తి పాల్గొన్నారు.


కలశస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కడారి తమ్మయ్యనాయుడు దంపతులు

నేడు కాకినాడలో రెడ్ బుక్ డే సదస్సు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెడ్ బుక్ డే సందర్భంగా శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కాకినాడ కచేరీపేట యూటీఎఫ్ టీచర్స్ హోమ్‌లో ఏర్పాటు చేసిన సదస్సును విజయవంతం చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజా సంఘాల నాయకులు మలక వెంకటరమణ, కె.సత్తిరాజు, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, సంజయ్ గురువారం మీడియాతో మాట్లాడారు. మార్క్స్ ఏంజిల్స్ రాసిన కమ్యూనిస్ట్ ప్రణాళిక గ్రంథం 1848 ఫిబ్రవరి 21న విడుదలైన సందర్భం పురస్కరించుకుని వామపక్ష ప్రచురణకర్తలు రెడ్ బుక్ డేగా ప్రకటించారన్నారు. ఈ ఏడాది ఐవీ లెనిన్ ప్రసిద్ధ రచన రాజ్యం-విప్లవం అనే గ్రంథం చదవాలని, చర్చించాలని పిలుపునివ్వడం జరిగింది తెలిపారు. ఈ అంశంపై రైతు సంఘం రాష్ట్ర నాయకుడు విరాం భూపాల్ సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ సదస్సుకు అందరూ ఆహ్వానితులేనని వారు స్పష్టం చేశారు.

పీఆర్ ప్రిన్సిపాల్‌పై ప్రారంభమైన విచారణ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యంపై గురువారం విచారణ ప్రారంభమైంది. ఆయనపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కళాశాలలో కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. కళాశాలకు చెందిన రిటైర్డు అధ్యాపకుడు కళాశాలలోని పరీక్షల విభాగంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ విద్యాశాఖ కమిషనర్‌కు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో గతేడాది నవంబర్‌లో రాజమహేంద్రవరం ఆర్జేడీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ విచారణ చేపట్టి నివేదికను అందజేశారు. అయితే తాజాగా గుంటూరు ఆర్జేడీ అధ్యక్షతన మరో ముగ్గురు సభ్యులతో కలిపి కమిటీని ఏర్పాటు చేశారు. కళాశాలలో ఈ కమిటీ 3రోజుల పాటూ విచారణ చేపట్టనున్నట్టు సమాచారం. మొదటి రోజు విచారణలో భాగంగా కళాశాలకు సంబంధించిన రికార్డులు, ఆదాయ, వ్యయాల ఫైళ్లను పరిశీలించారు. అనంతరం విభాగాల వారీగా కళాశాల అధ్యాపకులను విచారించినట్టు తెలిసింది. మరో రెండు రోజుల పాటూ కమిటీ విచారణ కొనసాగనుంది.

మహిళలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం కాకినాడ పెద్దమార్కెట్ ఏరియాలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నా ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజ్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు తదితరులున్నారు.

మహిళలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం కాకినాడ పెద్దమార్కెట్ ఏరియాలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నా ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజ్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

విధుల్లో పశు వైద్యాధికారి నిర్లక్ష్యం

వైద్యశాలకు తాళం

• గౌరిదేవిపేట పశు వైద్యాధికారి తీరుపై విమర్శలు • పశుసంవర్ధక సహాయకులతో వైద్యం • 15 గ్రామాల్లోని పశువులకు అందని వైద్యం



గౌరిదేవిపేట పశు వైద్యశాల కార్యాలయం

ఎటపాక, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) ఎటపాక మండలం గౌరిదేవిపేట ప్రధాన పశు వైద్యశాల కార్యాలయానికి గ్రహణం పట్టింది. ఇక్కడి పశు వైద్యశాల నెలల తరబడి మూతబడే ఉంటోంది. ఇక్కడ విధులు నిర్వర్తించే వైద్యాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గౌరిదేవిపేట పశువైద్యశాల పరిధిలో సుమారు 15 వరకు గిరిజన గ్రామాలు ఉన్నాయి. రోగాలబారినపడిన పశువులు, గొర్రెలు, మేకలను ఇక్కడి వైద్యశాలకు నిత్యం వాటి యజమానులు వైద్యం కోసం తీసు కొని వస్తుంటారు. నెలల తరబడి పశువైద్య శాల మూతబడే ఉండటంతో వాటి యజమానులు గగ్గోలు పెడుతున్నారు. పశుసంవర్ధక శాఖ సహాయకులు అందుబాటులో లేకపోతే భద్రాచలానికి చెందిన కొందరు ప్రైవేట్ పశు వైద్య సిబ్బందిని ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల తమపై ఆర్థికభారం పడుతోందని వాటి యజమానులంటున్నారు.

15 గ్రామాల్లోని పశువులకు అందని వైద్యం: నల్లకుంట, వినాయకపురం, పూసు గూడెం, కృష్ణవరం, గన్నవరం, గౌరిదేవిపేట, భూపతిరావుపేట, రామవపురం, గన్నేరు కొయ్యపాడు, చింతల చెరువు, అచ్చుతాపురం తదితర గ్రామాల్లోని పశువులు, గొర్రెలు, మేకలకు ఇక్కడ చికిత్స అందిస్తుంటారు. అయితే నెలల తరబడి దీనికి తాళం వేయ డంతో పాటు, పశువులకు మందు బిళ్లలు ఇచ్చేవారు లేకపోవడంతో వాటి యజమా నులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విధులకు వైద్యాధికారి గైర్హాజరు: రెండేళ్ల క్రితం ఇక్కడ వైద్యాధికారిని నియమించారు. ప్రస్తుతం ఆయన భద్రాచలం నుంచి విధులకు రాకపోకలు సాగిస్తున్నారు. విధుల్లో ఆయన నిర్లక్ష్యంపై మెమో జారీ చేసినా ఆయన వ్యవహారశైలిలో మార్పు రాకపోగా అదే తీరున వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గౌరిదేవిపేట పశు వైద్యశాల కార్యాలయాన్ని రోజూ తెరిచి, పశువులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పశు యజమానులు కోరుతున్నారు. ఈ విషయమై నెల్లిపాక పశు సంవర్ధకశాఖ ఏడీ వెంకటేశ్వరరావును వివరణ కోరగా వైద్యాధికారి విధులకు సక్రమంగా హాజరుకావడంలేదనే దానిపై ఫిర్యాదులు అందాయన్నారు. ఆయన వ్యవహారశైలిపై మెమో జారీ చేసినట్టు తెలిపారు.



రంపచోడవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష తదితరులు

ఎమ్మెల్సీగా పేరాబత్తులను గెలిపించండి

రంపచోడవరంలో ఎమ్మెల్యే శిరీషదేవి ఇంటింటి ప్రచారం

రంపచోడవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరిషదేవి, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్ గురువారం రంపచోడవరంలో ఇంటింటి ప్రచారం చేశారు. రంపచోడవరంలో పలు ప్రాంతాల్లో తెలుగుదేశం శ్రేణులతో వారు ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడబాల బాపిరాజు, కారం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్‌ని ఆశీర్వదించాలని రంపచోడవరం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన నెల్లిపాక, ఎటపాక, టీపీవీడు, గన్నవరం, గౌరిదేవిపేట గ్రామాల్లో ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర నాయకులు మహమ్మద్ జమాల్‌ఖాన్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్, నియోజకవర్గ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ బాచినేని శ్రీకాంత్, నాయకులు నలజాల శ్రీకాంత్, జనసేన మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్, కె.మధు పాల్గొన్నారు.

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం బచ్చులూరు, మర్రిగూడెం, తెలుగు క్యాంపు, మంగంపాడు, బొడ్డు మామిడి గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పల్లాల సన్యాసిరావు, మరిగెల తెల్లనయ్య, కాకూరి బాలు రెడ్డి, వేమరాజు, తురక వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

17 మందికి డ్రైవింగ్ లైసెన్సులు

వై.రామవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్‌పీఎఫ్ డి 42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో ఇరవై రోజులుగా మండలంలోని పలువురికి డ్రైవింగ్‌పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయిన అనంతరం గురువారం సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రసాద్ ఆధ్వర్యంలో 17 మందికి వాహన లైసెన్సు పత్రాలు అందించారు. మరో 15 రోజుల్లో పర్మినెంట్ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు చైతన్య, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డ్రైవింగ్ లైసెన్సులు పొందిన యువకులతో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రసాద్

చదువుతోపాటు న్యాయ అవగాహన కలిగి ఉండాలి

దేవీపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంటూరు పంచాయతీ పరిధిలో ఇందుకూరు 1 ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఎంపీపీ పాఠశాల ఏనుగులగూడెం, మంటూరు జీపీఎస్ పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాజ్యాంగం హక్కులు, చట్టాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పారాలీగల వలంటీర్ల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, ఆదివాసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



న్యాయ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం విజయానికి కృషి చేయాలి



జగ్గంపేట: కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



ఏలేశ్వరం: మర్రివీడులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు



ప్రత్తిపాడు: ధర్మవరంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

జగ్గంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో కాండ్రేగులలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కాండ్రేగుల గ్రామ శాఖ అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, జనసైనికులు సూరబత్తుల వీరబాబు, బండారు లక్ష్మీసాధు, బండారు వీరబాబు, అడబాల వినయ్, సూరబత్తుల మణికంఠ, ఇంటి శ్రీరామాంజీ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటు వేయండి

ఏలేశ్వరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశే ఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని గురువారం మర్రివీడు,

పలు చోట్ల ప్రచారం

జె.అన్నవరం, రమణయ్యపేట గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు పంచారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, కూటమి నాయకులు జ్యోతుల పెదబాబు, పలివెల శ్రీనివాస్, కాలారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేరాబత్తులకు విజయం చేకూర్చండి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఘన విజయం చేకూర్చాలని పలువురు కూటమి నాయకులు కోరారు. మండలంలోని టి.రాయవరం, ధర్మవరం, ఒమ్మంగి, లంపకలోవ తదితర గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. నాయకులు దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, బొల్లు వెంకటేశ్వరరావు, సోమన్నదొర, ప్రసాద్, యర్రా బత్తుల గోవిందనాయుడు, కొప్పనబోయిన ఏసుబాబు, తటవర్తి రామన్నదొర పాల్గొన్నారు.

గండేపల్లిలో జనసేన ప్రచారం

గండేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ గురువారం గండేపల్లిలో జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గోన శివ, వీరబాబు, కనకం వెంకన్న, అక్కిరెడ్డి వీరబాబు, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు అమానుషం

శంఖవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులపై దాడులు అమానుషమని శంఖవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కేళంగి హరినాథ్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పాత్రికేయుడు రామారావుపై దాడికి నిరసనగా గురువారం ర్యాలీ నిర్వహించి తహశీల్దారు తాతారావుకి వినతిపత్రం అందించారు. సీనియర్ పాత్రికేయులు బొట్ల లోవరాజు, రేలంగి దొరబాబు, పులి రాధాకృష్ణ, హరిగోపాల్, మాజీ అధ్యక్షుడు నెల్లిపూడి కృష్ణ, రమణ, రవి, సూర్య, అపురూప్, తాతాజీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా 'ఉత్సవ్-2కే 25'

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీనగర్‌లోని ఆదిత్య పాఠశాల 41 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉత్సవ్-2కే 25 పేరిట గురువారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదిత్య చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ టి.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పడాల ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సూర్యప్రసాద్, గౌరవ అతిథిగా పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్‌ఐ కరుణప్రియాంక పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ 41ఏళ్లుగా ఆదిత్య ఎన్నో విజయాలు సాధించిందన్నారు.సూర్యప్రసాద్‌మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలన్నారు.

ఎరువుల తయారీతో పంచాయతీలకు ఆదాయం



లింగంపర్తిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వర్మీకంపోస్టు తయారీ ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చవచ్చని ఎంపీడీవో సూర్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని లింగంపర్తి, రమణయ్యపేట గ్రామాల్లో ఉన్న తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఎరువుల తయారీ కేంద్రాలను సందర్శించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పరిసరాలను పరిశుభ్రం చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి సంపద తయారీ కేంద్రాల్లో నిల్వ చేయడం ద్వారా ఎరువు తయారు చేసుకోవచ్చన్నారు. తద్వారా పంచాయతీలకు సంపద సృష్టించవచ్చన్నారు.

ధర్మవరంలో లేగదూడల ప్రదర్శన



ధర్మవరంలో లేగదూడల ప్రదర్శనలో బహుమతి పొందిన లేగదూడ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం పశువైద్యశాల వద్ద గురువారం రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా సంవత్సరం లోపు పుట్టిన 40 పెయ్యిదూడలు పాల్గొన్నాయి. వీటిలో 15 దూడలు లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టినవి ఉండడం విశేషం. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన తోట సత్యనారాయణ, చిలకలపల్లి వెంకటరమణ, ఇంటిపల్లి గోపిలకు చెందిన పెయ్యిదూడలకు బహుమతులను ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ చిక్కిం బాలచంద్ర యోగిశ్వర్, పశువైద్య శస్త్రచికిత్స సహాయకులు డాక్టర్ ఎస్.వరలక్ష్మి, పీఎస్‌ఎస్ మంజూషా, డాక్టర్ వీవీ కల్యాణి అందజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న 40 పెయ్యిలకు ఏలికపాముల నివారణ మందు, బ్రూసెల్లో వ్యాక్సినేషన్ వేశారు. పశు సంవర్ధక సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో షాపుల తొలగింపు







రామేశ్వరంపేటలో రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చేస్తున్న షాపులు, బందోబస్తుగా వచ్చిన పోలీసులు, తహశీల్దార్‌ను ప్రశ్నిస్తున్న బాధితుడు

పూర్తిస్థాయిలో నష్టపరిహారం, గడువు ఇవ్వకుండా తొలగించారని బాధితుల ఆరోపణ

గండేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా మండలంలోని రామేశ్వరంపేట సెంటర్లో షాపులను గురువారం పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎక్స్‌కవేటరుతో తొలగించేందుకు పనులు చేపట్టారు. అయితే పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకుండా షాపులు తొలగిస్తే ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లేదని, షాపుల్లో ఉన్న సామగ్రిని తీసుకునే అవకాశం ఇవ్వకుండా తొలగించడమేమిటని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్‌ఐ శివనాగబాబు, జగ్గంపేట ఎస్‌ఐ రఘునందనరావు, కిర్లంపూడి, పెద్దాపురం ఎస్‌ఐలతో పాటు భారీ బందోబస్తు నడుమ షాపులను తొలగించారు. గతంలోనే వీరికి తెలియపరిచి మార్కింగ్ ఇచ్చామని అధికారులు చెప్పారు. ప్రయాణికుల రక్షణలో భాగంగానే షాపులు తొలగించామని వివరిం చారు. అయితే రోడ్డు విస్తరణలో అందరికీ సమానమైన నష్టపరిహారం ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

గొల్లప్రోలులో సప్తాహ మహోత్సవాలు ప్రారంభం


గొల్లప్రోలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో జరుగుతున్న 20వ సప్తాహ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. కలశస్థాపన కార్యక్రమంలో జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి దంపతులు పాల్గొని తొలిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ, ఇతర పూజా కార్యక్రమాల అనం తరం 168 గంటల పాటు నిరంతరం జరిగే భజన కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి పెదబాబీ, పీబీసీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ దువ్వ కొండ, మొగలి రామ్మూర్తి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ దేవరాజ్‌మనీష్ ఆదేశాలతో సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో మహిళల వద్ద చైన్లను లాక్కెళ్లే దొంగలు తిరుగుతున్నారనే సమాచారంతో ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు చేపట్టినట్టు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. చీడిగ, ఇంద్రపాలెం, కొవ్వాడ గ్రామాల్లో వాహనాలను తనిఖీచేశారు.

పేదల పథకంలో అంతులేని అవినీతి

• రూ.14.96 కోట్ల 'ఉపాధి హామీ' నిధుల వినియోగంపై గ్రామాల్లో తనిఖీలు



చేపూరులో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

తునిరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో జరిగిన పనుల్లో అంతులేని అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్న ఆరోపణలు వెల్లువెత్తాయి. పేదల కోసం అమలుచేసిన ఈ పథకంలో అప్పటి రాజకీయ పెద్దలు జోక్యం చేసుకుని తునిలో అందిన కాడికి దోచుకున్నారన్న విమర్శలున్నాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో నిధులు లేక విలవిలలాడిన గ్రామపంచాయతీలను ఉపాధిహామీ నిధులేఆదుకున్నాయి. అలాంటి ఉన్నతమైన పథకంలో లొసుగులను ప్రజాప్రతినిధులు నాయకులు, అనుకూలంగా మార్చుకుని దోచుకున్నట్లు అప్పటి అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు అందాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. వాటిలో కొన్ని సామాజిక తనిఖీల్లో వెలుగు చూడగా, మరికొన్ని సమాధి అయ్యాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తునిలో రూ.14.96కోట్ల నిధులు వినియోగంపై గ్రామాల్లో సామాజిక తనిఖీలు జరుగుతున్నాయి. అప్పటి నాయకుల ఒత్తిళ్లతో తప్పులు చేసిన సిబ్బంది ఇప్పుడు కూడా అదే ప్రాంతంలో పని చేస్తున్నారు. సామాజిక తనిఖీల నేపథ్యంలో వారుచేసిన అవినీతి, అక్రమాలు ఎక్కడ బయట పడతాయోనని బిక్కుబిక్కుమంటున్నారు.

అక్రమాలు వెలుగులోకి వచ్చేనా

వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ జోక్యం ఎక్కువగా ఉండేది. చేయని పనులకు ఉపాధి కూలీల పేరుతో మస్తర్లువేసి బిల్లులు మంజూరు చేయడం, యంత్రాలతో పని చేసి కూలీలు చేసినట్లు చూపి నిధులు స్వాహాచేయడం, జాబ్‌కార్డు కలిగి పనికి వెళ్లని వారి పేరుతో మస్తర్లు వేసిజేబులు నింపుకోవడం వంటి అక్రమాలు, అప్పట్లో వెలుగు చూశాయి. తునిలో కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న సామాజిక తనిఖీలు అయినా పారదర్శకంగా జరగాలని, గత పాలకులు లూటీ చేసిన ప్రజాధనాన్ని వెనక్కి రాబట్టాలని పలువురు కోరుతున్నారు.

అదృశ్యమైన మహిళ తల్లిదండ్రులకు అప్పగింత

జగ్గంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన వివాహిత తన చిన్న పిల్లలతో సహా రాత్రి ఇంటి నుంచి మిస్సింగ్ అయింది. గురువారం ఉదయం పది గంటలకు జగ్గంపేట పోలీసులకు రిపోర్టు చేయగా వెంటనే స్పందించిన ఎస్‌ఐ రఘునందన్‌రావు, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఆ మహిళను కాకినాడ డి-మార్ట్ ఏరియాలో ట్రేస్ చేశారు. ఆమెను చిన్న పాపతో సహా ఆమె తల్లికి అప్పగించారు. ఆమె బంధువులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జె.కొత్తూరు 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్లు నరికివేత, మరమ్మతులు, లైన్ ఏబీ స్విచ్ ఎరెక్షన్ కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందని జగ్గంపేట ఏఈ వీరభద్రరావు తెలిపారు. కొత్తూరు, బలభద్రపురం, గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌లకు సరఫరా ఉండదన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శంఖవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి సబ్ స్టేషన్ పరిధిలోని సీతంపేట, కొత్తూరు, వజ్రకూటం, పాత వజ్రకూటం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.వీరభద్రరావు తెలిపారు. విద్యుత్ లైన్‌లో నిర్వహణ పనుల కారణంగా ఉదయం ఏడు నుంచి రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

'ఆదిత్య'లో ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభం

గండేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ (సెంటర్ ఫర్ టీచింగ్ అండ్ లెర్నింగ్) మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిజిటల్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ విత్ ఎఫ్‌పీజీఏ అనే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభమైంది. ఈ కోర్సును డాక్టర్ మొహమ్మద్ తాజ్ ప్రారంభించి ఆధునిక అంశాలపై ఉపన్యాసం అందించారు. ముఖ్యమైన పరిశోధన అంశాలపై విస్తృత చర్చలు నిర్వహించారు.

స్టడీ టూర్‌లో భాగంగా ఫ్యాక్టరీ సందర్శన

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 30 మంది స్టడీటూర్‌లో భాగంగా అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ సందర్శనకు గురువారం ప్రత్యేక బస్సులో వెళ్లారు. బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ వారు విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన, ఆసక్తి కల్పించేందుకు దీన్ని నిర్వహించామని ప్రధానోపాధ్యాయులు డివి గోపాలకృష్ణ తెలిపారు. విద్యార్థులతో పాటు సైన్స్ ఉపాధ్యాయులు ఎం.శాంతిప్రియ, ఎస్. అప్పారావు ఉన్నారు. చప్పా సత్యనారాయణ మూర్తి, కొండబాబు పాల్గొన్నారు.

పీఆర్ ప్రిన్సిపాల్‌పై ప్రారంభమైన విచారణ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యంపై గురువారం విచారణ ప్రారంభమైంది. ఆయనపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కళాశాలలో కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. కళాశాలకు చెందిన రిటైర్డు అధ్యాపకుడు కళాశాలలోని పరీక్షల విభాగంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ విద్యాశాఖ కమిషనర్‌కు చేసిన ఫిర్యాదు నేపథ్యం లో గతేడాది నవంబర్‌లో రాజమహేంద్రవరం ఆర్జేడీ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీ విచారణ చేపట్టి నివేదికను అందజేశారు. అయితే తాజాగా గుంటూరు ఆర్జేడీ అధ్యక్షతన మరో ముగ్గురు సభ్యులతో కలిపి కమిటీని ఏర్పాటు చేశారు. కళాశాలలో ఈ కమిటీ 3రోజుల పాటూ విచారణ చేపట్టనున్నట్టు సమాచారం. మొదటి రోజు విచారణలో భాగంగా కళాశాలకు సంబంధించిన రికార్డులు, ఆదాయ, వ్యయాల ఫైళ్లను పరిశీలించారు.